నమస్తే తెలంగాణ
కామారెడ్డి
10 | నిజామాబాద్, బుధవారం 22 జనవరి 2025 | KAMAREDDY

- లబ్ధిదారుల ఎంపికలో లోటుపాట్లు
- జాబితాల్లో అర్హుల పేర్లు లేవని ధ్వజం
- పోలీసు పహారా నడుమ సభల నిర్వహణ
- లొసుగులపై ప్రశ్నించిన వారిని నెట్టేసిన పోలీసులు
- సర్కారు తీరుపై ప్రజల మండిపాటు

# గ్రామసభల్లో జనాగ్రహం

**ఎక్కడికక్కడ నిరసనలు.. నిలదీతలు**

## జనాలపై పోలీసు జులుం

కమ్మర్‌పల్లి మండలం నర్సాపూర్ గ్రామంలో మంగళవారం జరిగిన గ్రామసభ రచ్చ రచ్చగా సాగింది. రైతుభరోసాకు సంబంధించి అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుభరోసాలో పేర్లు ఎలా తొలగించారని నిలదీశారు. ఇష్టం వచ్చినట్లు పేర్లు తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. సభ రచ్చరచ్చగా మారుతుండడంతో పోలీసులు వచ్చి ప్రజలను అక్కడి నుంచి నెట్టేయడం కలకలం రేపింది.


నర్సాపూర్ గ్రామసభలో ప్రశ్నిస్తున్న వ్యక్తిని తోసేస్తున్న పోలీసు

## ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలె..

మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల్లో ప్రారంభమైన గ్రామసభల్లో ప్రజలు అధికారులను నిలదీశారు. రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకుని ఏడాది గడుస్తున్నా సర్వేలో తమ ఇండ్లకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. రాని వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రాజశ్రీనివాస్ సూచించగా, ఎన్నిసార్లు దరఖాస్తులు చేసుకోమంటారని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో కూడా అనుమానాలు ఉన్నాయని, ఒకే ఇంట్లో ముగ్గురు, నలుగురిని ఎంపిక చేయడం అనుమానాలకు తావిస్తున్నదని ఆరోపించారు. తిమ్మాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల విషయంలోలబ్ధిదారుల ఎంపిక సరిగా జరగలేదని, ఉన్నవారికే అన్ని ఇస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారులను ప్రశ్నించేందుకు వచ్చిన మహిళలను పోలీసులు వచ్చి అక్కడి నుంచి పంపించి వేశారు. అమీర్‌నగర్ గ్రామంలో ప్రభుత్వ పథకాలపై ప్రజలు అధికారులను నిలదీశారు.


అర్హుల పేర్లు జాబితాలో లేకపోవడంతో బిచ్కుంద మండలం ఫత్లాపూర్ గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

## ప్రభుత్వ ఉద్యోగుల పేర్లు..

జాబితాల్లో అవకతవకలపై డిచ్‌పల్లి, ధర్పల్లి తదితర మండలాల్లోనూ జనం నిలదీశారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల కోసం అధికారులతో వాగ్వాదానికి దిగారు. అన్ని అర్హతలున్నప్పటికీ తమ పేర్లు జాబితాలో రాలేదని, ప్రభుత్వ ఉద్యోగులు, బడా వ్యాపారుల పేర్లు మాత్రం ఎలా వస్తాయని ప్రశ్నించారు. తనకు నలుగురు కొడుకులున్నారని, ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నా తన పేరు జాబితాలో రాలేదని నడిపల్లికి చెందిన వికలాంగురాలైన ఆశాబేగం ఆవేదన వ్యక్తం చేశారు. అద్దె ఇంట్లో ఉంటున్న తమ పేర్లు జాబితాలో రాలేదని జ్యోతి కౌర్, రూప వాపోయారు. ధర్పల్లి మండలం రామడుగు, దుబ్బాక గ్రామాల్లో అర్హులైన వారికి ఇండ్లు, రేషన్ కార్డులు మంజూరు కాలేదని అధికారులను నిలదీశారు. ఇండ్లు ఉన్న వారికి మళ్లీ ఇందిరమ్మ ఇండ్లు ఎలా కేటాయిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాల్కొండ మండలంలోని వన్నెల్(బి)లో పేదలకు కాకుండా పెద్దలకు, ప్రభుత్వ ఉద్యోగులకు, భూమి ఉన్న వారి కుటుంబాలకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఎలా ఇస్తారని ఆందోళన చేశారు.


తమ పేర్లు జాబితలో లేవని పత్రాలు చూపుతున్న లబ్ధిదారులు


కమ్మర్‌పల్లి గ్రామసభలో అధికారులపై ప్రశ్నల వర్షం కురిపిస్తున్న స్థానికులు

## అర్హులెవరికి ఇస్తారు?

ప్రభుత్వ పథకాల ఎంపికలో అర్హులైన వారి పేర్లు లేకపోవడంపై జనం మండిపడ్డారు. బోధన్ మండలం కల్దుర్కి, పెడగాపల్లి, ఎరాజ్‌పల్లి, మినార్‌పల్లి, హంగర్గ, పెంటకుర్దు తదితర గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో జనాగ్రహం వెల్లువెత్తింది. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా , ఇందిరమ్మ ఇండ్ల పథకాలు ఇస్తామని చెప్పారని, ఇప్పుడు లిస్టులో చూస్తే అర్హులమైన తమ పేర్లు రాలేవని జనం మండిపడ్డారు. కల్దుర్కిలో రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా పథకాలలో తమ పేర్లు రాలేదని అధికారులను పలువురు నిలదీశారు. పెగడాపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు చేసినా, గుంట భూమి లేకున్నా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద తమ పేరు ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. రేషన్ కార్డుల జాబితాలో పేర్లు లేవని, మళ్లీ సర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు. సాలూరా మండలంలోని జాడిజమాల్‌పూర్, సాలంపాడ్ గ్రామాల్లోని గ్రామ సభలలో గందరగోళం నెలకొన్నది. ఎన్నికల ముందు అందరికీ రేషన్‌కార్డులు ఇస్తామని చెప్పి, ఇప్పుడు తూతూ మంత్రంగా కొంత మందికే ఇస్తున్నారని మండిపడ్డారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించిన సర్వే సరిగా చేయలేదని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో అర్హుల పేర్లు లేవని ఆందోళన వ్యక్తంచేశారు. అర్హులైన వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించగా, ఎన్నిసార్లు దరఖాస్తు చేయాలని ప్రజలు నిలదీశారు.


బోధన్‌లో అర్హుల పేర్లు జాబితాలో లేకపోవడంపై అధికారులను నిలదీస్తున్న యువకులు

**ఒకవైపు నిరసనలు..** మరోవైపు నిలదీతలతో గ్రామసభలు జనాగ్రహానికి గురయ్యాయి. హామీల అమలులో విఫలమైన రేవంత్ సర్కారు తీరుపై ఆగ్రహావేశాలు వెల్లువెత్తాయి. లబ్ధిదారుల ఎంపిక జాబితాల్లో అర్హుల పేర్లు గల్లంతు కావడంతో ప్రజలు అధికారులను నిలదీశారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ ఆత్మీయ భరోసా పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం మంగళవారం ఉమ్మడి జిల్లాలో నిర్వహించిన గ్రామ, వార్డు సభలు రచ్చరచ్చగా మారాయి. ఆయా పథకాలకు సంబంధించి అర్హుల పేర్లు జాబితాలో లేకపోవడం, కొన్ని పథకాలకు ఒకే ఇంటి నుంచి ముగ్గురు, నలుగురిని ఎంపిక చేయడం వివాదాస్పదమైంది. అనేక లోటుపాట్లతో కూడిన జాబితాలు ప్రదర్శించడంపై ప్రజలు నిలదీయడంతో గ్రామసభల్లో గందరగోళం నెలకొన్నది. మరోవైపు, పోలీసు పహారా నడుమ సభలు నిర్వహించడం, లొసుగులపై ప్రశ్నిస్తున్న ప్రజలపై వారు జులుం ప్రదర్శించడం విమర్శలకు తావిచ్చింది.

– నమస్తే తెలంగాణ యంత్రాంగం, జనవరి 21


జాబితాలో అర్హుల పేర్లు ఎందుకు లేవని బొమ్మన్‌దేవ్‌పల్లిలో ప్రశ్నిస్తున్న ప్రజలు

## కామారెడ్డి జిల్లాలో..

కామారెడ్డి జిల్లా బాన్సువాడ, గాంధారి, నస్రుల్లాబాద్, బీర్కూర్, నాగిరెడ్డిపేట తదితర మండలాల్లో ప్రజలు అధికారులను నిలదీశారు. అనర్హుల పేర్లు జాబితాలో ఉండడం, అర్హుల పేర్లు గల్లంతు కావడంపై ప్రశ్నించారు. బాన్సువాడ మండలంలోని జక్కల్ దాని తండా, ఇబ్రహీంపేట్ తండాల్లో రేషన్‌కార్డుల కోసం అధికారులను నిలదీశారు. నస్రుల్లాబాద్ మండలం బొమ్మన్‌దేవ్‌పల్లిలో అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వలేదని, భూములు ఎక్కువ ఉన్నవారికి ఇచ్చారని అధికారులను నిలదీశారు. గాంధారిలో నిర్వహించిన గ్రామ సభలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాలో తమ పేర్లు రాలేదని, అనర్హుల పేర్లు జాబితాలో ఉన్నాయని గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గౌరారంలో ఆత్మీయభరోసా పథకంలో అనర్హుల పేర్లు వచ్చాయని, వారి పేర్లు తొలగించాలని గ్రామస్తులు కోరారు.

**ఉన్నోళ్లకేనా కాంగ్రెస్ పథకాలు**

మాక్లూర్, జనవరి 21: ఇండ్లు ఉన్నోళ్లకే ఇండ్లు ఇస్తారా? అని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి అధికారులను నిలదీశారు. మాక్లూర్ మండలంలోని మామిడిపల్లి, కల్లడి, గంగరమంద, అమ్రాద్‌లో మంగళవారం నిర్వహించిన గ్రామ సభల్లో ఆయన పాల్గొన్నారు. అమ్రాద్‌లో లబ్ధిదారుల జాబితాను తహసీల్దార్ శేఖర్ ప్రకటించగా, రాకేశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థలం ఉన్న వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూ రు చేయాల్సి ఉండగా, ఇప్పటికే ఇండ్లు ఉన్న వారికి ఎలా మంజూరు చేస్తారని ప్రశ్నించారు. ఇల్లు ఉన్నోడికి ఇస్తే రూ.5 లక్షలు తీసుకుని వాళ్లు ఎంజాయ్ చేయడానికేనా? అని నిలదీశారు. పేదలకు ఇవ్వాల్సిన రేషన్ కార్డులు ఉన్నోళ్లకే ఎలా మంజూరవుతాయని ప్రశ్నించారు.

## వారిపై కేసులు నమోదు చేయాలి


ఇన్‌చార్జి సీపీకి ఫిర్యాదు చేస్తున్న మేయర్ నీతూకిరణ్, బీఆర్ఎస్ నాయకులు

వినాయక్‌నగర్, జనవరి 21: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ఫొటోలను మార్ఫింగ్ చేసి హేళన చేసేలా ప్రచారం చేసిన వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులను వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జి సీపీ సింధూశర్మను మంగళవారం కలిసి ఫిర్యాదు చేశారు. ధర్మపురి అరవింద్ ఆర్మీ పేరుతో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మేయర్ నీతూకిరణ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు సిర్ప రాజు, మాజీ కార్పొరేటర్ విశాలినిరెడ్డి, సుమనారెడ్డి సీపీని కలిసిన వారిలో ఉన్నారు.

**దిగజారుడు రాజకీయాలు..**

మహిళా ప్రజాప్రతినిధిని కించపరిచేలా పోస్టులు పెట్టడం దిగజారుడు రాజకీయానికి నిదర్శనమని మేయర్ నీతూకిరణ్ పేర్కొన్నారు. ఇన్‌చార్జి సీపీకి ఫిర్యాదు చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. అరవింద్ ధర్మపురి ఆర్మీ అనే ఐడీతో పోస్ట్ పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల డిమాండ్ చేశారు. ఎంపీ అరవింద్ ధర్మపురి అనుచరులు విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారని, కనీసం మహిళాప్రజాప్రతినిధి అనే గౌరవం లేకుండా కించపరచటం సిగ్గు చేటని మండిపడ్డారు.

# అయోమయం గందరగోళం

**కుటుంబ సర్వే, ప్రజాపాలన దరఖాస్తులు 'ఏమయ్యాయని ప్రశ్నలు**

- అంతా అస్పష్టత
- పరిశీలక బృందాలకే నిర్ణయాధికారం
- ఉత్సవ విగ్రహాల్లా ఇందిరమ్మ కమిటీలు
- దరఖాస్తులతో అనేక చోట్ల ప్రజల బారులు
- రేషన్ కార్డుల కోసమే జనం ఎదురుచూపులు


నిజామాబాద్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

నిజామాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం తలపెట్టిన గ్రామ, వార్డు సభలు మంగళవారం తీవ్ర గందరగోళం నడుమ ప్రారంభమయ్యాయి. ఇందిరమ్మ ఇండ్లు, రైతుభరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు అర్హుల ఎంపిక జరుగుతుండగా, చాలాచోట్ల రేషన్ కార్డుల కోసమే ప్రజలు పోటెత్తారు. కొత్తగా దరఖాస్తులతో గ్రామసభలకు తరలి వచ్చారు. కొన్నిచోట్ల నూతనంగా అప్లికేషన్లు స్వీకరించగా, మరికొన్ని చోట్ల స్వీకరించలేదని విమర్శలు వచ్చాయి. ఈ నెల 26 నుంచి రూ.12 వేల పెట్టుబడి సాయం ఇస్తామని ప్రభుత్వం ప్రకటన చేసింది. వివరాల అప్‌డేట్ కోసం వ్యవసాయాధికారులు ఫోన్లు చేయకపోవడంతో చాలా మంది ఇబ్బందులకు గురయ్యారు. వారసత్వ భూముల బదలాయింపు, కొత్తగా భూముల క్రయ, విక్రయాల్లో మారిన పట్టాదారులంతా ఇబ్బందులకు గురయ్యారు. వ్యవసాయాధికారులు మాత్రం ఫోన్లు చేస్తామంటూ రైతులను పంపించారు. నిజామాబాద్ జిల్లాలో మొత్తం 530 గ్రామ పంచాయతీలుండగా, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీ, నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 146 వార్డులు/డివిజన్లున్నాయి. గ్రామాల్లో 113, పురపాలక ఏరియాలో 20 కలిపి మొత్తం 133 క్లస్టర్లుగా విభజించారు. కామారెడ్డి జిల్లాలో 535 గ్రామ పంచాయతీలు, 80 మున్సిపల్ వార్డులున్నాయి. నాలుగు రోజుల్లో గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించేలా ప్రణాళికలను రచించినప్పటికీ సమయ పాలన పాటించ కపోవడంతో ప్రజలు సమస్యలు ఎదుర్కొన్నారు.

## ప్రజాపాలన దరఖాస్తులేవి?

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రాగానే ప్రజా పాలన పేరిట ఆరు గ్యారంటీల అమలుకు దరఖాస్తులను స్వీకరించింది. దీంతో ప్రజలు భారీగా దరఖస్తులు చేసుకున్నారు. సర్కారు అందించే సాయాన్ని పొందేందుకు అర్హత పత్రాలతో వివరాలు అందించారు. కానీ ఇప్పటిదాకా పథకాల అమలు కాలేదు. ప్రజాపాలనలో అందించిన దరఖాస్తుల ప్రకారం రేషన్ కా ర్డు రాలేదు. ఈ మధ్యే కుటుంబ సర్వే ను నిర్వహించారు. ఇందులో వ్యక్తిగ త, స్థిర, చరాస్తులతో పాటు ఇంట్లో పెంచుకునే పెంపుడు జంతువుల వివరాలను సైతం ప్రభు త్వం సేకరించిం ది. ఇలా రెండు విధాలుగా ప్రజల నుం చి దరఖాస్తులు స్వీకరించిన తర్వాత తిరిగి గ్రామసభల పేరిట కార్యక్రమాలు నిర్వహించడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. పథకాలు అమలు చేసిందేమీ లేదు. ఆశ పెట్టి చావ గొడుతున్నారంటూ జనం ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాపాలన దరఖాస్తులనే గ్రామసభ, వార్డు సభల్లో చదివి వినిపించారు. ఇందులో పేరు లేని వారి నుంచి కొత్తగా దరఖాస్తులు తీసుకున్నారు. రేషన్ కార్డు మంజూరు పేరుతో మరికొన్ని పేర్లను వెల్లడించారు. ఈ ప్రక్రియ కొన్ని చోట్ల జనాలను ఆగమాగం చేసింది. పట్టణాల్లో, గ్రామాల్లో ఎక్కడ చూసినా అత్యధికులు రేషన్ కార్డుల కోసమే గ్రామసభలకు వచ్చారు. ఆ తర్వాత ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసిన వారు ఉన్నారు. గతంలో మీసేవలో దరఖాస్తు చేసి రేషన్ కార్డులు రాని వారికి గ్రామ సభల్లో ఊరట దక్కింది. ఇక్కడ అర్హుల జాబితాను ప్రకటించారు. ఈ జాబితాపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## దిశ, దశలేని ఇందిరమ్మ కమిటీలు..

మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు సాగే ఈ సమావేశాల్లో ఇందిరమ్మ కమిటీలు ఉత్సవ విగ్రహాల్లా మారాయి. ప్రభుత్వ అధికారుల బృందాలకే నిర్ణయాధికారం ఉండడం తో కాంగ్రెస్ శ్రేణులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. గ్రామ సభల్లో, వార్డు సభల్లో అంతా పరిశీలక బృందాలదే పెత్తనం ఉండడంతో వీరంతా మిన్నకుండి పోవాల్సి వచ్చింది. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ తీరుతెన్నులపై ఇందిరమ్మ కమిటీల్లో భాగస్వామ్యమైన వారికి అవగాహన లేకపోవడం, ఇంత వరకూ విధివిధానాలను సరైన రీతిలో వెల్లడించక పోవడంతో అయోమయం నెలకొంది. గ్రామాల్లో తాజా మాజీలు, గ్రామాల్లో పెద్దరికం చేసే వ్యక్తులు ప్రభావం చూపుతున్నారు. పట్టణ, నగరాల్లో కౌన్సిలర్లు, కార్పొరేటర్ల ఆధ్వర్యంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు కూర్చుంటున్నారు. అయోమయంలో కొట్టుమిట్టాడుతున్న ప్రజ లు స్థానిక కాంగ్రెస్ లీడర్లను సంప్రదిస్తుండగా, ఏం సమాధానం చెప్పాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

# రైతుబంధు లేదు.. మాఫీ జెయ్యలేదు

## కమ్మర్‌పల్లి గ్రామసభలో మహిళా రైతు ఆగ్రహం


మహిళా రైతు లింగుబాయిని సముదాయిస్తున్న పోలీసు

మోర్తాడ్, జనవరి 21: కేసీఆర్ సారు ఉన్నప్పుడే మంచిగుండె. టైమ్‌కు రైతుబంధు ఇచ్చిండు. రుణమాఫీ జేసిండు. ఇప్పుడేమో రైతుబంధు లేదు ఏమి లేదని మహిళా రైతు ఆగ్రహం వ్యక్తం చేశారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో మహిళా రైతు ఏలేటి లింగుబాయి అధికారులపై మండిపడ్డారు. 'కేసీఆర్ ఇచ్చినయన్న ఇత్తలేరు. రైతుబంధు ఇత్తలేరు. రేషన్ కార్డు ఇయ్యలే. బాకీ మాఫీ జెయ్యలే' అని అక్కడున్న అధికారులను నిలదీశారు. కేసీఆర్ ఇచ్చినయన్న ఇత్తలేదు. బాకీ మాఫీ చేస్తమన్నరు. ఒక్కొక్కొల్లకు రెండుసార్ల మాఫీ జేసింన్రు. మాకు జెయ్యలేరని ఆవేదన వ్యక్తం చేశారు. 'మాకు బియ్యపు కార్డు గావాల. రైతుబంధు గావాల. మరి ఇత్తరా ఇయ్యరా? ఓట్లచ్చేదాంకా గిట్లనే జూత్తరా?' అని అన్నారు. కాంగ్రెస్ నాయకులు సముదాయించేందుకు ప్రయత్నిస్తూ రుణమాఫీ వచ్చిందికదా అని అనగానే, లిస్టు ఉందిగద చూడుపో అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా రైతుకు కాంగ్రెస్ నాయకులు, పోలీసులు సర్దిచెప్పారు.

## ఎమ్మెల్యే ఫొటో లేకపోవడంపై ఆగ్రహం


గ్రామసభ బ్యానర్‌పై ఎమ్మెల్యే ఫొటో ఎందుకు పెట్టలేదని ప్రశ్నిస్తున్న మాజీ ఎంపీటీసీ

మోర్తాడ్, జనవరి 21: ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ నిబంధనలు పాటించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఇలాగే వ్యవహరించి షోకాజ్ నోటీసులు అందుకున్నప్పటికీ వారి తీరు మారడం లేదు. తాజాగా నిర్వహిస్తున్న గ్రామ సభ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఫొటో పెట్టక పోవడంపై బీఆర్ఎస్ నేతలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కమ్మర్‌పల్లిలో మంగళవారం జరిగిన గ్రామసభలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఫొటో లేదు. ఇది గమనించిన మాజీ ఎంపీటీసీ మైలారం సుధాకర్ అధికారులను నిలదీశారు. గతంలో కూడా ఇలాగే ఎమ్మెల్యే ఫొటో లేకుండానే గ్రామసభలు నిర్వహించారని, మళ్లీ అదే పరిస్థితి కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు సర్దిచెప్పారు. మరోసారి ఇలా జరగకుండా చూస్తామని ఎంపీడీవో రాజశ్రీనివాస్ బదులిచ్చారు.

# పోలీసు పహారా మధ్య గ్రామసభలా?

- రేవంత్‌రెడ్డి.. ఇదేనా మీ ప్రజాపాలనా?
- మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఎద్దేవా



మోర్తాడ్, జనవరి 21: పోలీసుల పహారా మధ్య గ్రామసభలు ఎందుకు నిర్వహిస్తున్నారు, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా ఎందుకు వ్యవహరిస్తున్నారు, ఇదేనా మీ ప్రజాపాలన రేవంత్‌రెడ్డి గారు అని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. మంగళవారం నిజామాబాద్ జిల్లాలో ప్రారంభమైన గ్రామసభల తీరును గురించి తెలుసుకున్న ఆయన ఈ మేరకు స్పందించారు. ముఖ్యమంత్రి, మంత్రులు పాలన గాలికి వదిలేసి విదేశాల్లో తిరుగుతుంటే గ్రామసభలు పోలీసుల కనుసన్నల్లో జరపడం మీచేత కాని పాలనకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. హామీలపై నిలదీస్తున్న ప్రజలను ప్రభుత్వ ఆదేశాలతో పోలీసులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. గ్రామసభల్లో పాల్గొన్న అధికారులను.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై ప్రజలునిలదీస్తూ నోటికొచ్చినట్లు తిడుతున్నారని తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో కాంగ్రెస్ నాయకులకే పెద్దపీట వేస్తున్నారంటూ జనం ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎక్కడిక్కడ నిలదీస్తున్నారన్నారు. గ్రామసభల్లో ప్రజల వ్యతిరేకత చూశాక ప్రజలు మీ ప్రభుత్వంపై ఎంత ఆగ్రహంగా ఉన్నారో తేటతెల్లమైందన్నారు.

# పేలిన ట్రాన్స్‌ఫార్మర్

**తప్పిన పెను ప్రమాదం, రూ.70 లక్షల నష్టం**


ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో ఎగిసిపడుతున్న మంటలు

కామారెడ్డి,జనవరి 21: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల రోడ్‌లో ఉన్న రాజీవ్ పార్క్ పక్కనున్న 33/11 సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా పేలిపోయింది. భారీ శబ్దంతో మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల వారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారమివ్వడంతో అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. సుమారు నాలుగు గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పివేశారు. షార్ట్‌సర్క్యూట్ వల్లే పేలుడు జరిగి ఉంటుందని భావిస్తున్నారు. మంటలతో పాటు దట్టమైన పొగ ఆవరించడంతో సబ్ స్టేషన్ నుంచి అర కిలోమీటర్ వరకూ పోలీసులు ఎవరినీ రానివ్వలేదు. సబ్‌స్టేషన్ పక్కనే రైస్‌మిల్ ఉండడంతో అటువైపు మంటలు వ్యాపించకుండా ఫైర్ సిబ్బంది నియంత్రించారు. ట్రాన్స్‌ఫార్మర్ పేలుడుతో రూ.70 లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని ఎస్ఈ శ్రవణ్‌కుమార్ తెలిపారు. విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని, రెండు, మూడు రోజుల్లో మరమ్మతులు పూర్తి చేయిస్తామని చెప్పారు.